అనుభూతి

కె. లలితాచలం

"బాబూ!" అని ఓ కీచుగొంతు భయం కరంగా అరిచింది సాయం సంధ్య వేళ. చల్లగాలికి పిల్లల కేరింతలతో సముద్రపు ఒడ్డు కలకలలాడుతోంది. తల్లులు తండ్రులు, జంటలు, దుకాణాలు తినుబండారాలు, ఒకటేమిటి అతి కోలాహలంగా ఉన్న ఆ సముద్రపు ఒడ్డు.

సముద్రపు హోరును కూడా మింగేసి వచ్చిన 'బాబూ' అన్న ఆ అరుపుకు అందరూ అదిరిపోయారు. పిల్లలు తల్లుల్ని కరుచుకుపోయారు భయంతో.

ఏమిటా కేక? ఎక్కడ్నించి? ఏమైంది? ఆ కేక విన్నవారందరికీ అనేక ప్రశ్నలు పుట్టుకొచ్చాయి మరుక్షణం. అందరి చూపులు దిక్కులు వెతికాయి విషయం తెలుసుకోవాలని. కొందరి కాళ్ళు ఆ కేక వచ్చిన దిక్కుకు అడుగులు వేశాయి వెంటనే.

అప్పటికే అక్కడికి గుంపు చేరింది. వారిని తోసుకుంటూ కొన్ని తలలు తొంగి చూశాయి. అక్కడ వారికి కనిపించిన దృశ్యం హృదయ విదారకంగా ఉంది.

ఒక స్త్రీ స్పృహలేకుండా పడిఉంది. "బాబూ! బాబూ" గొణుగుతోంది. కాళ్ళూ చేతులు కొంకర్లుపోతున్నాయి. అక్కడ చేరినవారిలో ఎవరో ఇనుప తాళం చేతులు వాసన చూపిస్తున్నారు. అందరూ ఆమెని కళ్ళింతింతచేసుకుని చూస్తున్నారు.

ఆమె బట్టలు, నగలు, రూపం ఆమె ఒక గొప్పింటి స్త్రీ అని చెప్పకుండానే తెలుస్తోంది. వయసుకూడా నడివయసే. అయినా అందంగా ఉందామె. ఆమె చుట్టూ చిన్నపిల్లలాడుకునే బొమ్మలు, పాలబుడ్డి పడివున్నాయి. ఆమెకు కొంచెం దూరంలో ఒక తోపుడుబండి మాత్రం ఉంది. అది ఆమెకు సంబం

ధించింది అవునో కాదో తెలీదు. కానీ ఆమె త్వరగానే కళ్ళు తెరిచింది. తన చుట్టూ పడిఉన్న బొమ్మల్ని, పాలబుడ్డినీ చూసింది. అమాంతంగా వాటిని గబ గబా పోగుచేసుకుని అమాంతం తోపుడు బండి దగ్గరకెళ్ళింది, అందులో తడుము కుంటూ, ఏడుస్తూ

"బాబూ! నా బాబూ, నా బాబేడీ! నా బాబు నెవరో తీసుకుపోయారు" అంటూ పిచ్చిదాన్లా దాంట్లో ఉన్న బట్టలన్నిటినీ తీసి విసిరేసింది. అందరివంకా అనుమానంగా చూసింది ఓ క్షణం. మరుక్షణం అందర్నీ తోసుకుంటూ,

"బాబూ! బాబూ! నా బాబునెవరో ఎత్తుకుపోయారు. బాబూ! బాబూ!" అంటూ అరుస్తూ పరిగెట్టుకుపోయింది ఆమె వెతుక్కుంటూ. "ఆమె ఎవరో ఏమిటో!" అనుకున్నారు కొందరు.

"పాపం! ఆమె పిల్లాడ్నెవరో ఎత్తుకు పోయినట్లున్నారు. పోలీసు రిపోర్టిస్తే సరి." అనుకున్నారు కొందరు ఉచిత సలహా మాత్రం గాలిలోకి వదిలేస్తూ.

"పిచ్చిదేమో!" అనుకున్నారు మరి కొందరు, ఆమె చూపులు చూసి.

"పిల్లాడ్ని ఎత్తుకుపోతే ఆ తల్లి తట్టుకోలేక మూర్ఛపోయినట్లుంది. ఏదైనా మూర్ఛలరోగం ఉన్నప్పుడు ఒంటరిగా బయటికి రావడం ప్రమాదమే!" అని జాలిపడినవారు కూడా ఉన్నారు వచ్చిన గుంపులో.

"అసలు ఆమె ఎవరో! తెలీనివారు రోడ్డుమీద జరిగే విషయాలు మనకెందుకులే అని వెళ్ళిపోతూ, నోరూరుకోక అనుకుంటూ వెళ్ళిపోయారు

కొందరు మాత్రం ఆమెని పిచ్చిదిగా, మూర్ఛల రోగిగా అనుకోలేదు.

కారణం ఆమె అరగంట క్రితం హుందాగా నవ్వుతూ, తోపుడుబండిని తోసుకుంటూ, మెల్లగా నడుస్తూ మధ్య మధ్య బండిలోకి వంగి ముద్దెట్టుకుంటూ మురిసిపోతూ వీధిఒడ్డున నడవటం చాలా మంది చూశారు. బొమ్మలు కొనటం చూశారు.

ఆమెని జమీందారు రాజారామ్మోహన్ గారి భార్యగా గుర్తించారు. గౌరవ పూర్వకంగా నమస్కరించారు కూడాను.

కాని ఆశ్చర్యపోయారు కూడాను.

కారణం ఆమె ఎన్నడూ ఒంటరిగా రావడం ఎవరూ చూడలేదు. వెంట భర్తో, నౌకర్లో రావటం వారికి తెలుసు. కాని పిల్లల్నెప్పుడూ వెంటపెట్టుకురాగా చూడకపోయినా బొమ్మల్ని కొనడం చూశారు. వీధికొచ్చిన చిన్నచిన్న పిల్లల్ని ఎత్తుకు ముద్దాడటం, బొమ్మలియ్యటం చూశారు. కాని ఈ రోజు ఆమె ఒంటరిగా పసిబిడ్డని బండిలో పడుకోబెట్టుకుని తోసుకురావటం వారికి అమితాశ్చర్యాన్ని కలిగించింది. కాని ఎవరూ దాన్నంతగా పట్టించుకోలేదు.

కాని ఆమె మూర్ఛిల్లి 'బాబూ! బాబూ!' అంటూ హృదయవిదారకంగా అరిచిన అరుపు, ఆమె బిడ్డకోసం కొన్న బొమ్మలు పాలబుడ్డి ఆమెచుట్టూ పడిఉన్న దృశ్యం, ఆమె బిడ్డకోసం తీసిన పరుగు - ఆ దృశ్యాల్ని చూసినవారి హృదయాన్ని పిండేసింది. ఎంత వద్దనుకున్నా పాపం! ఎవరో ఆమె! ఆమె బిడ్డ ఆమెకు దొరికితే బావుణ్ణు! అని పదేపదే అనుకున్నారు...

* * *

ఆ దృశ్యం చూసినవారి గుండెలు బరువై పేగులు కదిల్చే ఆమె ఆక్రందన మరవలేకపోవడం ఆశ్చర్యకరమైన విషయం కాదు.

కాని ఆ దృశ్యం చూడనివారి గుండెలు కూడా పిండేస్తోంది మాటి మాటికీ రేడియోలో వినిపించే ఒక స్త్రీ కంఠం. కార్యక్రమానికీ కార్యక్రమానికీ మధ్య వ్యాపార ప్రకటనలొచ్చినట్లు. దుఃఖంతో పూడుకుపోయిన ఓ స్త్రీ కంఠం గద్గదికమై చెపుతోంది.

"తల్లులారా! తండ్రులారా! చేయెత్తి నమస్కరిస్తున్నాను. నా బాబుని ఎవరెత్తుకుపోయినా నా బాబునేం చెయ్యకండి. పట్టుమని పాతికరోజులు చూడని పసిగుడ్డు వాడు. తృప్తిగా నా చనుబాలు కూడా తాగని నెత్తురుగుడ్డు వాడు.

"నన్ను మీ తల్లిలా, చెల్లిలా, బిడ్డలా తలచి నామీద జాలిచూపమని అడగను. నా బిడ్డకు కడుపారా తల్లిపాలు తాగే అదృష్టాన్ని కలిగించండి, చాలు."

"తల్లులారా! పసిబిడ్డలేని పచ్చిబాలెంత ఎంత బాధపడుతుందో తల్లులందరికీ తెలుసు. దయుంచండి. తల్లులారా! అన్నలారా! తమ్ములారా! నా బిడ్డని నాకు దూరం చెయ్యకండి. వాడ్నేంచెయ్యకండి. మీకు దణ్ణం పెడతా బాబూ" హృదయాన్ని తొలిచేట్లు ప్రతిమలాడుతోంది ఆ స్త్రీ కంఠం.

ఆ ప్రకటన, ఆ స్త్రీ ఆక్రందన ప్రతి స్త్రీని కలచివేస్తోంది. కదిలించేస్తోంది. గగుర్పాటు కలగచేస్తోంది. తమ బిడ్డల్ని కూడా ఎవరైనా ఎత్తుకుపోతారో! అన్న భీతి కలుగుతోంది అందరికీ. తమ బిడ్డల్నెవరైనా ఎత్తుకుపోతే ఎలా విల విలలాడిపోతారో! ఊహించుకుని విల విలలాడిపోతున్నారు. స్త్రీజనంతో పాటు పురుషులు కూడాను భయాంపితులౌతున్నారు.

ఎవరి నోట విన్నా ఇదేమాట "అంత పిల్లల్నే కాక పసిపిల్లల్నెత్తుకెళుతున్నారుట కూడాను" అని.

"పాపం! అంత పసిగుడ్డుని తల్లి దగ్గిర్నుంచి ఎలా ఎత్తుకెళ్ళారో!" అనుమానం కొందరికి.

"వేటకొచ్చిన పులి పొంచిఉన్నట్లు దొంగలు పొంచే ఉంటారు. అదనుకోసం ఇవాళ రేపు పసిపిల్లల్ని చంపి గుండె కాయల్ని ఎగుమతి చేస్తున్నార్ట. మన దేశంలో జనాభా ఎక్కువ. పాపిష్ఠి

సంతానాలు ఎక్కువేనాయె. ఆ బిడ్డని ఈపాటికి చంపి గుండెకాయని విదేశాలకు పంపుంటారు".

అమ్మో! ఈ వార్త తెలిస్తే ఆ తల్లి బ్రతుకుందా! ఇదేమంత పెద్ద విషయం కాదన్నట్లు తేలిగ్గా అనుకుంటూనే జాలి నిర్లిప్తత ప్రకటించారు కొందరు.

"విదేశాలకే ఎగుమతి చెయ్యక్కర్లేదు. దుష్టశక్తుల్ని పూజించే మంత్రగాళ్ళు దేశంలో పెచ్చు పెరిగపోయారుగా! కాది వాళ్ళ పనే అయిఉండొచ్చు. అయినా అమావాస్య అర్ధరాత్రిగానీ వాళ్ళు బలులు ఇయ్యర్డు. అమావాస్య రెండురోజులుందిగా. ఆ పాపిష్టిముండావాణ్ణి పట్టుకోగలిగితే బిడ్డ ప్రాణాలతో దొరుకుతుంది" తరుణో పాయం తలుచుకునిత్ర్ప్తిపడ్డారుకొందరు.

"పసివాడ్ని గుర్తుపట్టడమెలా! నెల లోపు పిల్లలంతా ఒకేతీరునుంటారు తెలుపు నలుపు తేడా తప్ప" మార్గం తెలియక విలవిలలాడారు అమాయకులు.

"జంతు క్రిమికీటకాదులకు మనిషి శత్రువైతే, మనిషే మనిషికి శత్రువై పోయాడు. విదేశస్థులకి బిడ్డల్నమ్మి డబ్బు చేసుకుంటున్నార్ట. అలా జరిగితే పాపం తల్లికి బిడ్డ దూరమౌతదన్న బాధ. బిడ్డకు తల్లి కరువౌతున్నదన్న వేదన తప్ప చావుబాధ లేదు. పాపం ఆ తల్లి కడుపుశోకంతో ఎంతతల్లడిల్లిపోతోందో. బిడ్డ చచ్చిపోయాకంటే గుండె బండ చేసుకుని బ్రతకొచ్చు. కాని కుండల్లా నిండి బండలా బరువయే పాలకుండల బరువుబాధ స్త్రీకి మాత్రమే తెలుసు" తల్లులు తల్లడిల్లారు.

"బిడ్డ చన్నుకుడిస్తే మైమరపు, పాలు నిండితే పులకింత, పాలుతాగే బిడ్డను చూస్తుంటే కలిగే మమతానుభవం స్త్రీ జాతకే ఒక అందమైన అనుభవం. అదో అమరానుభూతి పాపం! ఆ తల్లి పిల్లవాడ్ని గురించి ఎన్ని కలలుకన్నదో! భగవంతుడు ఆ అనుభవానికి దూరంచేశాడు" వేదాంతం, విమర్శ. ఎన్ని ఎందరు అనుకున్నా ఆ తల్లిమీద అందరికీ జాలి ఎవర్నీ నిలవ నివ్వటంలేదు.

"పసివాడి కళ్ళో కాళ్ళో తీసేసి ముష్టి వాణ్ణి చెయ్యటానికి ఎత్తుకెళ్ళారని కొందరి అనుమానం.

ఆమె బిడ్డను ఆమెకు చేర్చాలని అందరి యత్నం.

కాని ఆమె ఎడ్రస్ ఇవ్వలేదు. రేడియో స్టేషన్‌లోగాని, టి.వి. స్టేషన్‌లోగాని, పోలీసు కంట్రోల్‌రూమ్‌కుగాని నిర్ణీత సమయాల్లో తెలియబరచమని అన్ని పేపర్లలోనూ ప్రకటించారు.

ఇన్ని రకాలుగా ఆ పసిబిడ్డకోసం ప్రకటిస్తున్నారంటే, ఆ స్త్రీ డబ్బుగలదై ఉండొచ్చనుకున్నారు కొందరు. ప్రభుత్వం, పోలీసులు, ఆస్పత్రులూ ఉచిత సేవచేస్తున్నట్లు రేడియో, టి.వి., పేపర్లు ఉచిత సహాయం చేసుంటారని కొందరు.

బహుమతి ప్రకటించకపోవటం కూడా వారికి ఆశ్చర్యకరమే అయింది.

కాని బీచిఒడ్డున ఆ దృశ్యం చూసిన వారు మాత్రం ఏ మాత్రం అనుమాన పడలేదు.

తాము బిడ్డను తీసుకెడితే మంచి బహుమతి లభిస్తుందని ధైర్యపడ్డారు.

అందరి కళ్ళూ పసిబిడ్డల్నే చూస్తున్నాయి. మానవత్వమున్న మనుషుల్లా అందరిదీ ఒక్కటే ధ్యేయం. బిడ్డను తల్లిదగ్గిరకు చేర్చాలి. ఆ తల్లిని చూడాలి.

* * *

ప్రకటన వచ్చిన కొన్ని గంటలకే నిర్ణీత సమయాల్లో రేడియో, టి.వి. పోలీసుస్టేషన్ల దగ్గర పసిపిల్లల్నెత్తుకుని క్యూ వరసలు వరసలుగా నిలిచారు.

కాని ప్రతి బిడ్డని లోపటికి తీసుకెళ్ళి, "ఈ బిడ్డకాదు. ఈ బిడ్డ కాదని" తిరిగి ఇచ్చేస్తుంటే నిరుత్సాహపడిపోయారంతా. తాముపడ్డ కష్టం వృధా అయినందుకు విసుగుచెందారు కొందరు.

కొందరు ఇదేదో రాజకీయ కుట్రను కున్నారు. ఏదైనా సినిమా ప్రకటన ప్రచారమై ఉండొచ్చనుకున్నారు.

నీలివార్త అనుకుని తమ పిచ్చికి తామే సిగ్గుపడ్డారు. నవ్వుకున్నారు.

కాని పోలీసుశాఖవారు తలలు పంచుకుంటున్నారు. ఇంతమంది ప్రజల సహకారమున్నా, రవికాననిచోట కూడా కనుగొనగలమని ప్రజ్ఞలు పలికే తమ శాఖ ఒక పసిగుడ్డు ఆచూకీ కనుక్కోలేక తికమకపడిపోతున్నారు.

పుండుమీద కారంలా పోలీసువారికో ఫోను అర్జంటుగా రమ్మని.

అదే ఫోను డా॥ ద్వారకీదేవికి కూడా వచ్చింది అర్జంటుగా రమ్మని. పోలీసు జీపు, డాక్టరు కారు రెండూ ఒకేసారి వచ్చి ఆ యింటిముందు ఆగాయి. పోలీసుల్ని చూసి ఒక్షణం బిత్తరపోయిందామె. ఆ యింట్లో ఎవరి ముఖానా కత్తివాటుకు నెత్తురుచుక్కలేదు. అందరి ముఖాల్లో భయం, ఆందోళన తాండవిస్తున్నాయి. జమీందారు రాజారామ్మోహన్ ఎదురొచ్చారు వారికి. ఆయన ముఖం వాడిపోయింది. ఆయన భార్య కుముదినికి విపరీతంగా మూర్ఛవచ్చినప్పుడల్లా ఆమె చావు బ్రతుకులమధ్య కొట్టుమిట్టాడటం ఆయన ఆందోళనచెంది అలా అయిపోవటం డా॥ ద్వారకీదేవికి మామూలే.

పోలీసుల్ని, ద్వారకిని లోపలికి రమ్మని సంజ్ఞచేసి మౌనంగా లోనికినడిచారాయన.

ద్వారకీదేవికి పోలీసులకు అసలు విషయం అర్థంకాక ఆయన్ని అనుసరించారు. ప్రశ్నించకుండా. లోన ప్రవేశించగానే కుముదిని నవ్వులు, పిల్లల కేరింతలు ఆటబొమ్మలు ఏవీ ఇంట్లో కనిపించకపోయేసరికి డాక్టరుగా కాక కుముదిని స్నేహితురాలిగా ఆందోళన చెందింది ద్వారకీదేవి కుముదిని

ఏదీ? ఏమైంది? అనడిగింది, ఏదో కీడు శంకిస్తూ. భయంకర నిశ్శబ్దం రాజ్యం చేస్తున్న ఆ సమయంలో రాబందు అరుపులా ఉంది ఆమె అడిగిన తీరు.

"నేను నాలుగు రోజులుగా ఊళ్ళో లేను. ఇవాళే వచ్చాను రెండురోజులుగా కుముదిని ఆ గదిలోంచి బయటకు రావటంలేదుట. పిలిచినా పలకటంలేదు. తలుపు తియ్యటంలేదు. అసలు బ్రతికుందో లేదో! ఏది ఏమైనా చావుబ్రతుకుల నిర్ధారణకు డాక్టరు, చట్టబద్ధమైన సాక్ష్యానికి పోలీసులు అవసరమనిపించి ఫోను చేశాను" అంటూ పూరించిన బుగ్గలు బిగించి దుఃఖాన్ని ఆపుకుంటూ ఎటో చూశారాయన.

పరిస్థితి కొంత అర్థమై అయ్యన్ని నిభాయించుకోమని ధైర్యం చెప్పి మెల్లగా గదితలుపు దగ్గిరకెళ్ళి,

"కుముదినీ! తలుపు తియ్యి" అని పిలిచింది డా॥ ద్వారకి. సమాధానంలేదు. చడీచప్పుడులేదు. తలుపు తెరుచుకోలేదు. తలుపుమీద గట్టిగా కొడుతూ పిలిచిందామె. దానికీ సమాధానం రాలేదు.

మామూలుగా అయితే ద్వారకీదేవి గొంతు అల్లంత దూరాన వింటేనే పసిపిల్లలా కిలకిలా నవ్వుతూ పరిగెట్టుకొచ్చి కౌగలించుకుంటుంది కుముదిని.

డా॥ ద్వారకీదేవి ఆమె చిన్ననాటి స్నేహితురాలు. అందుకే ఆమంటే కుముదినికి ఇష్టం. ఆమంటే కుముదినికి చాలా గౌరవం. ఆమె హిత ధైర్యవచనాలు కుముదిని మనసుకు ఆ మాటలపేటలు ఊరట. ద్వారకీదేవంటే భయం కూడా ఉంది. మారాంచేసి మంకుపట్టి మందు వేసుకోకుంటే, మత్తుమందిచ్చి నిద్రపుచ్చేస్తుంది. అప్పుడు కుముదిని పిల్లలదగ్గిరకెళ్ళలేదు. పిల్లలు తన దగ్గిరకు రాలేరు. పిల్లల్ని చూడకుండా కుముదిని ఉండలేదు. అందుకే ద్వారకి చెప్పినట్లు చేస్తుంది కుముదిని

ద్వారకీదేవికి ఈ మధ్య కుముదిని అతి చేరువైంది. మాటిమాటికీ భయంకరంగా ఫిట్సురావడం ఫోనుమీద తను పరిగెత్తుకొచ్చి తగ్గిందాకా ఉండివెళ్ళడం వారిద్దర్నీ గట్టిగా బంధించింది.

కుముదిని త్వరలో అందరిలా ఆరోగ్యంగా ఉండి ఆయుప్పు కలది కావాలని మనస్ఫూర్తిగా దేవుని ప్రార్థించేది.

అటువంటి ఆత్మీయురాలి దగ్గరనుండి ఏ సమాధానం లేక ఆమెలో భయం, ఒణుకు పుట్టుకొచ్చాయి.

నిస్సహాయంగా అందరివంకా చూసింది ద్వారకీదేవి.

తలుపులు బలవంతాన తెరిచారు.

చిమ్మచీకటి నిండిన గదిలో తెరచిన తలుపులు వెలుగు నింపాయి.

దడదడలాడే గుండెలు గట్టిగా ఉగ్గపట్టుకుని అందరూ లోన అడుగు పెట్టారు

ఎలాంటి దృశ్యం చూడాల్సొస్తుందో! అని గుమ్మందగ్గిరే ఆగారంతా.

మంచంమీద కుముదిని వెనక్కి తిరిగి కూచుని కనిపించింది. అందరికీ ఊపిరొచ్చింది ఆమె బ్రతికున్నందుకు. కాని ఆమె వీరి రాకను గమనించినట్లు లేదు. తలైనా తిప్పి చూడలేదు. ఏదో పరవశంతో ఏదో ఆనందానుభూతిని పొందుతోందామె.

తమ రాకను ఆమె గమనించాలని శబ్దాలు చేసింది ద్వారకీదేవి.

దానికీ చలించలేదామె. కాని చిన్నగా బాధతో, "అబ్బా!" అని మాత్రం అంది.

ద్వారకీదేవి మరి ఆ శబ్దం విన్నాక ఆగలేదు అమాంతం ఆమె ముందుకెళ్ళి "కుముదినీ! ఇటు చూడు ఎవరొచ్చారో!" అంది, మెల్లగా తానొక్కతే మంచం దగ్గిరగా వెళ్ళి.

"ఉష్" అని శబ్దం చెయ్యవద్దంది కుముదిని నోటితోనే. అక్కడి దృశ్యం ద్వారకిని నిశ్చేష్టురాల్ని చేసింది. మరి నోట మాటరాలేదు. దుఃఖం పొల్లుకొచ్చింది ద్వారకీదేవికి. పట్టరాని దుఃఖంతో.

"కుముదినీ! ఆపు కుముదినీ! అలా చెయ్యకు" అని అరిచింది. కాని కుముదినికి ద్వారకీదేవి మాటలేం వినిపించటంలేదు.

కాని ద్వారకీదేవి మాటలకు రామ్మోహన్‌గారు లోనికిపరిగెట్టుకొచ్చారు ఏమైందో! ఏమిటో! అని.

ద్వారకీదేవిని కలచివేసిన దృశ్యం రామ్మోహన్‌గారిని నిలవనివ్వలేదు. చూడలేకపోతున్నారాయన ఆ దృశ్యం.

కుముదిని స్తనాలు వాచి రక్తపుముద్దల్లా రక్తాన్ని చిముతున్నాయి. వాటిని తన రెండు చేతుల్తో పిండుకుంటోంది. క్షీరధార నివ్వాల్సిన స్తనాలు రుధిరాన్ని కుమ్మరిస్తున్నాయి. వాటి బాధ ఓర్చుకోవాలనే విశ్వప్రయత్నంచేసి ఓడిపోయి, బాధతో మూలుగుతోంది కుముదిని. అయినా తన ప్రయత్నం విడవకుండా పిండుకుంటోంది ఏ అనుభూతికోసమో!

అందరి కళ్ళూ అప్రయత్నంగా ఆమె ఒడిలోకి వాలాయి. ఆమె రుధిరభాండాలు తన ఒడిలోని బిడ్డ నోట్లో కుక్కుతూ బాధామయసంతో సానుభూతిని పొందటానికి ప్రయత్నిస్తోంది.

ద్వారకీదేవి రామ్మోహన్‌గార్లు ఆ బిడ్డను చూసి విస్తుపోయారు. ఇద్దరి మనసుల్లో ఒకటే ప్రశ్న.

ఎవరీ బిడ్డ? ఎక్కడ్నించొచ్చింది?

ఆ చోట్లో తమకేం పనిలేదనిపించి పోలీసు ఇన్‌స్పెక్టర్ కలవడిగాడు రామ్మోహన్‌గార్ని.

కాని ఇనస్పెక్టర్ కోరినట్లుగా కలవు దొరకలేదు సరికదా, మరో బాధ్యత నెత్తినొచ్చిపడింది.

"ఎంతోమంది చనిపోయిన బిడ్డల్ని కని మానసికంగా చితికిపోయిన తన భార్య తల్లి ప్రేమను పొందాలన్న

తపనతో పిల్లల్ని ఎత్తుకొస్తోంది. కాని అంతవరకూ ఎవరి పిల్లల్ని వారికి అప్పచెప్పటం జరిగింది. కాని నేను ఊళ్ళోలేని సమయంలో ఎక్కడినుంచో ఒక పసిబిడ్డను తెచ్చించి. ఆమెను క్షమించి ఈ బిడ్డను వారి తల్లితండ్రులకు అప్పజెప్పే బాధ్యత మీ కప్పగిస్తున్నాను. ఉధృతంగా ప్రకటనలివ్వండి. దానికయ్యే ఖర్చు కూడా ఇస్తాను" అన్నారాయన ప్రాధేయపడుతున్నట్లుగా.

ఇప్పటికే బిడ్డను పోగొట్టుకున్న ఒక తల్లికోసం నానా తిప్పలూ పడుతున్నారు పోలీసులు ఆ బిడ్డని వెతకలేక. మళ్ళీ మరో కేసా! తల్లిని వెతికే కేసు! అనుకుని కొంచెం తటాపటాయించి కంట్రోల్ రూముకి ఫోనుచేశాడు ఇనస్పెక్టరు.

ఏం మాట్లాడాడో ఏమో! పది నిమిషాల్లో పోలీసు వానొచ్చింది. దాంట్లోంచి ఒక స్త్రీని మెల్లగా దింపి లోనికి తెచ్చారు.

ఆమె ముఖం వాడిపోయి జుట్టు రేగిపోయి నీరసంతో ఊగిపోతోంది. లోతుకుపోయిన ఆమె కళ్ళు దేనికోసమో వెతుకుతున్నాయి. ఆరిపోయిన పెదవులు తడుపుకుంటూ, "ఏడీ! నా బాబేడీ! అనడిగింది పోలీసుల్ని. ఆమె కళ్ళలో ఆశ, మాటల్లో నిరాశ, నిస్పృహ, నిస్సహాయత నిండిఉన్నాయి.

"ఈమె రెండురోజుల క్రితం బీచి ఒడ్డున తన బిడ్డను పోగొట్టుకుందిట. ఎవరో ఎత్తుకుపోయార్ట. రేడియోలో ప్రకటన మీరు వినే ఉంటారు. ఈ బిడ్డ ఆమె బిడ్డేమో చూస్తుందని పిలిపించాను" ఆమె రాకకు కారణం అడక్కుండానే చెప్పాడు ఇనస్పెక్టర్.

"నీ బిడ్డని నువ్వు గుర్తుపట్టగలవా?" అనడిగింది ద్వారకి ముందుగా ఆమెని లోపలికి తీసుకెళ్ళడం ఇష్టంలేక.

"పట్టగలనమ్మా! ముఖంమీద కట్లు వేశారు కానుపైనప్పుడు కత్తెరతగిలిందని" అంది ఆమె.

"అసలు నీ బిడ్డ ఎలా పోయింది?" కుముదిని దగ్గరకు బిడ్డ ఎలా వచ్చిందో తెలుసుకోవచ్చని అడిగింది ద్వారకీదేవి.

"ఏం చెప్పనమ్మా! బీచి ఒడ్డున బొమ్మలమ్ముకుని బ్రతికేవాళ్ళం పిల్లల్ని వెంటేసుకునే వెడతాం. రోజూ అలాగే వెళ్ళాం. బేరం పెద్దగా లేదు. ఓ గొప్పింటి అమ్మ తోపుడుబండిలో బిడ్డనెట్టుకొచ్చి బోల్డు బొమ్మలుకొంది. ఆమె బిడ్డనట్లా బండిలో తోసుకెళ్తుంటే ముచ్చటేసి ఆమె వెళ్తున్నవేపే మైమరచి చూస్తూ నుంచున్నా. నా బిడ్డని కూడా అలాబండిలో పడుకోబెడితే ఎట్లా ఉంటుందో ఊహించుకుంటూ నుంచున్నా.

"అంతలో ఓ తల్లి ఏడుస్తూ వచ్చింది. తన బిడ్డనెవరో ఎత్తుకుపోయారంటూను. ఆ తల్లి వెళ్ళిన కొద్దిసేపటికే పెద్ద కేక వినిపించింది, 'బాబూ' అంటూ మేమంతా అక్కడికి పరిగెట్టాం. ఎంతైనా అది అడకూతురు కేక కదాని. మే మెళ్ళే సరికి ఆమె అక్కడలేదు. ఆమె బిడ్డని

ఎవరో ఎత్తుకుపోయారని ఏడ్చుకుంటూ వెళ్ళిపోయిందట మూర్ఛతేలి. అక్కడ బండి చూసి గుర్తుపట్టానమ్మా నేను. ఆ బిడ్డని పోగొట్టుకున్న తల్లి ఎవరో కాదు నా దగ్గిర బొమ్మలు కొన్నతల్లేనని. అంతే నా గుండె గుభేలుమంది. పిల్లల్ని ఎత్తుకెళ్ళేవాళ్ళెవరో వచ్చారని, వెంటనే బండిదగ్గిరకెళ్ళి కిందకొంగి బిడ్డకోసం చూసుకున్నా. బిడ్డ లేడు.

"నా బిడ్డని కూడా ఏ పాపిష్టోళ్ళో ఎత్తుకుపోయారు. వాళ్ళింట్లో పీనిగెళ్ళ! పాలుతాగే బిడ్డ ఏమైపోయాడో! ఏం చేశాగో" నోట్లో గుడ్డ కుక్కుకుని ఏడ్చింది ఆ దీనురాలు.

కుముదిని చేతులో బిడ్డ ఈమెదే అనిపించి వెళ్ళి చూసింది ద్వారకీదేవి. ఆ బిడ్డ ముఖాన కత్తిగాటు కుట్టు కనిపించింది.

"కుముదినీ! ఆ పాప తల్లొచ్చింది ఇవ్వు బిడ్డని" అంది కొంచెం కర్కశంగా ఆజ్ఞాపిస్తున్నట్లు.

కుముదిని ఆ మాట వినగానే బిడ్డని గుండెల కదుముకుని "ఇవ్వను. ఈ బిడ్డ నాది. నాక్కావాలి. నేను పాలు తాగించు కుంటా! కావాలంటే నా డబ్బంతా ఇస్తా తీసుకుపొమ్మను ద్వారకీ" అంటూ విలవిలా ఏడ్చింది.

"మీకు డబ్బుందొమ్మ. నాకు దరిద్ర ముండి డబ్బుకు ఆశ కక్కుర్తిపడొమ్మ తల్లీ! కాని నాబిడ్డక్కావలసిందిచనుపాలు. అవి మీ దగ్గిర్లేవు నా దగ్గిరున్నాయి. నా బిడ్డనిప్పించండి బాబూ! మీకు దణ్ణం పెడతా!" అంటూ ప్రాధేయపడింది ఆ దీనురాలు బరువౌతున్న స్థనాలు ఒత్తు కుంటూ. కుముదిని స్థితికంటే, దొంగి లించటం, తల్లి వొచ్చి ప్రాధేయపడు తున్నా ఇవ్వనంటున్న కుముదినంటే కోపం, అందరి ఎదుట అవమానం భరించలేకపోయారు రామ్మోహన్‌గారు. కుముదిని చేతులో బిడ్డను అమాంతం తీసుకున్నారు బలవంతంగా. "బాబు. నాకుబాబుకావాలి ఇవిగోపాలొస్తున్నాయి" అంటూ ఆ హఠాత్‌సంఘటన తాకిడికి కుముదిని తట్టుకోలేక ఎగిరెగిరి ఏడుస్తూ పడిపోయింది. పడిపోతున్న కుముదినిని పట్టుకున్న ద్వారకి ముఖం వెలవెల బోయింది. చల్లగా ఆమె ఒళ్ళు తగలగానే "కుముదినీ!" అంటూ భోరునేడ్చింది. క్షణాలలో వాతావరణం రంగులు మారింది ఆ యింట్లో.

రామ్మోహన్‌గారు మరి ఆ చోట నిలవలేక చేతులో బిడ్డని తీసుకుని బయటకు వచ్చారు.

బిడ్డని గుర్తుపట్టిన ఆ తల్లి ఒళ్ళు పులకరించింది. సంతోషంతో స్థనాలు ఎగిసిపడ్డాయి. ఎండిన కళ్ళు ఆనందంతో నిండిపోయాయి. "బాబూ!" అంటూ చేతులుచాచి బిడ్డనందుకుని హృదయానికి హత్తుకుంది. పొంగుతో బరువైన ఆమె క్షీరఘటాలు పొంగిపొర్లి కిందకు జారాయి పాలు.

"నన్ను క్షమించమ్మా! తల్లిగా స్థనమిచ్చి తన్మయత పొందాలని ఆశించి దానికి కరువై జరిగిన అఘాయిత్యం తల్లీ ఇది. ఇంక కుముదిని ఎవరి బిడ్డల్నీ ఎత్తుకుపోదు. తానే పసిబిడ్డగా మారి చనుబాలు తాగి తరించాలని ఎక్కడికో వెళ్ళిపోయింది. నీ బిడ్డని తీసుకెళ్ళమ్మా"



నిండిపోయిన దుఃఖంతో నమస్కరిస్తున్న రామ్మోహన్‌గారిని చూస్తుంటే బిడ్డ దొరికిందన్న సంతోషం మరచి దుఃఖం పొంగింది ఆమెకు. ఆ నిండిన కన్నీటితో బిడ్డని చూసుకుంది. పెదవులు తాకిన చనుబాలు చప్పరించటానికి ఆ బిడ్డలో ఊపిరి ఎప్పుడో ఎగిరిపోయింది! కుముదినే వాడివెంట వెళ్ళిందో ఏమో రెండు రోజులుగా పాలులేని పాపవెంటపడి. పోయినబిడ్డ దొరికినందుకు ఆనందించాలో దొరికినబిడ్డ పోయినందుకుఏడ్వాలో తెలియని దుస్థితి ఆమెది. కొన్నిక్షణాలు చలనండుడిగి తనను తాను ఓదార్చుకుంటూ–

"బాబూ! ఆ యమ్మ నాకే బిడ్డై పుడుతుంది" అంటూ వెళ్ళిపోయింది ఆపుకోలేని దుఃఖంతో. ఆమె వెళ్ళిన దారంట చనుబాలు రాలాయి.

——